క్లుప్తంగా

సకల శుభాలకు నాంది ఉగాది

రాయచోటి : సకల శుభాలకు నాంది ఉగాది అని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. షడ్రుతువులు, షడ్రుచుల సమాహారం ఉగాది అని తెలిపారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శోభకృత్ నామ సంవత్సరంలో నూతన అన్నమయ్య జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆయన అభిలషించారు. ఉగాది శుభాకాంక్షలను తెలిపారు.

నేడు భక్తులకు అమ్మవారి కలశపు టెంకాయలు

నందలూరు(రాజంపేట) : కన్యకల చెరువు గట్టులో వెలసిన ముత్తుమారెమ్మ ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని కలశపు టెంకాయలను భక్తులకు అందజేయనున్నట్లు ధర్మకర్త కోడి జయశ్రీ మంగళవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. రూ.500 విలువ చేసే కలశపు టెంకాయలను 125 మందికి అందజేయనున్నామన్నారు. భక్తులకు పూజలో ఉంచి కలశపు టెంకాయలు, తీర్థప్రసాదాలను ఇస్తామన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

రాజంపేట రూరల్ : ప్రైవేటు ఆసుపత్రిలో రికార్డులు పక్కాగా ఉండాలని డిప్యూటీ డెమో దేవ శిరోమణి కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహక వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం దేవశిరోమణి మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహక వైద్యులు స్కాన్ సెంటర్, ఆసుపత్రి, క్లీనిక్‌లను తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ప్రొగ్రామ్‌లైన హెచ్‌ఎంఐఎస్, ఐహెచ్‌ఐపీ, ఐఆర్‌ఏడీ యాప్‌లో రిపోర్టులను ప్రతి నెలా కచ్చితంగా నమోదు చేయాలని కోరారు.

ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలి

సంబేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక మంగళవారం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిద్దవటం : మండలంలోని మాధవరం- 1 గ్రామానికి చెందిన 6 మంది పేకాటరాయుళ్లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేశామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. వివరాలు.. మాధవరం-1 గ్రామంలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని తమకు సమాచారం రావడంతో తన సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడులు చేసి అదే గ్రామనికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పేక ముక్కలతోపాటు రూ. 4,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉద్యాన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు

రైల్వేకోడూరు అర్బన్ : ఉద్యాన విద్యార్థులకు అనేక రకాల అవకాశాలు ఉన్నాయని గరుడా కెమికల్స్ ఏజీఎం ఎంఎస్ రాయుడు మంగళవారం తెలిపారు. స్థానిక డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డీన్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఫేర్‌వెల్ డేకి రాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే కళాశాల అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పీజీతోనే చదువు ఆపకుండా ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయాలన్నారు. అలాగే స్థానిక విశ్వవిద్యాలయం నుంచి ప్రభుత్వ ఉద్యాన అధికారులుగా నియమింపబడ్డ 16 మంది విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

సంబేపల్లి : జగనన్న గోరుముద్దలో భాగంగా పౌష్టిక ఆహారమైన రాగిజావను దేవపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి డీఎస్పీ శ్రీధర్‌తో కలిసి విద్యార్థులకు రాగిజావను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్వరిబాయ్, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, నాయకుడు వడ్డి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా వారానికి మూడు రోజులు రాగిజావ అందించే బృహత్తర కార్యక్రమానికి మంగళవారం నుంచి శ్రీకారం చుట్టిందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి పేర్కొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : రాగిజావతోపాటు మాల్టులను ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం ప్రతి పాఠశాలలోనూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాగి జావను విద్యార్థులకు వారు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ, లక్కిరెడ్డిపల్లి బాలర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, జమ్రుత్ బేగం, ఆసీఫా అరుణ్ కుమారి, భారతి, శ్రీనివాసులు, మురళీ నాయక్, సోమశేఖర్ నాయక్, రసూల్ సాహెబ్, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



నందలూరు: రాగిజావను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : విద్యార్థులకు రాగిజావ మంచి పోషకాహారమని ఎంపీపీ మేడావిజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాసుబ్బారెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ, ఎంఈఓ గంగిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మట్టిబాబు, ఉపాధ్యాయులు అశోక్, ఖాజాహుసేన్, శేఖర్‌బాబు, చాన్‌బాషా, గౌరి, స్వర్ణలత పాల్గొన్నారు.



సంబేపల్లె: విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు

చిట్వేలిలో..

చిట్వేలి : జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావను అందించడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుడు కామాటం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పాత చిట్వేలిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు రాగిజావను అందజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : పిల్లలకు పోషక విలువలను పెంచే రాగిజావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు అన్నారు. మండలంలోని ఓబులరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిట్వేలి: విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న దృశ్యం



లక్కిరెడ్డిపల్లి: ప్రభుత్వ పాఠశాలలో..

తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉండకూడదు

– అధికారులకు ప్రభుత్వ విప్ కొరముట్ల ఆదేశాలు

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామాలలో వ్యవసాయానికి విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. స్థానిక మండల సభాభవనంలో జరిగిన మండల సమావేశానికి కొరముట్ల హాజరయ్యారు. పలు సమస్యలు, అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలు, రైతుల అభ్యున్నతికి, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, నిధుల సమస్యలు లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని గ్రామాలలో ప్రజలు సద్వినియోగపరుచుకొనే విధంగా చూడాలని తెలిపారు. మండలంలో జగనన్న గృహాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, గునిశెట్టిప్రశాంతి, అన్వర్‌బాషా, సుధాకర్‌రాజు, ఎంపీడీఓ నాగార్జున, తహసీల్దార్ రామ్మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలి

అత్యంత విలువైన పోషక పదార్థాలు ఉన్న చిరుధాన్యాల గురించి విద్యార్థులకు, గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలని మంగళవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో చిరుధాన్య ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌ను కొరముట్ల సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, అంగన్‌వాడీ అధికారులు పిల్లలకు, తల్లిదండ్రులకు, ప్రజలకు చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ప్రాధాన్యత తెలుకోవాలని తెలిపారు.

తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

రాజంపేట రూరల్ : తలీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే పోషన్ పఖ్వాడా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఐసీడీఎస్ సీడీపీఓ పి.నిర్మల తెలియజేశారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని సీడీపీఓ పి.నిర్మల జ్యోతీ ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బ్లాక్ ప్రాజెక్టు అసిస్టెంట్ హనుమంతు రమేష్, సూపర్‌వైజర్‌లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని వైద్యాధికారిణి దీపా పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక ఆహారంపై వైద్యాధికారి దీపా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షకురాలు అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనుసూయమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : చిన్నపిల్లల్లో చిరుధాన్యాలతో చేసిన ఆహారం మంచి పోషకాలు ఇస్తుందని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని సుద్దమళ్ల పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పోషణ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ నిర్మల

సంబేపల్లెలో..

సంబేపల్లె : చిరుధాన్యాలతో ఆరోగ్యం చేకూరుతుందని దేవపట్ల సెక్టార్ స్త్రీ,శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ నాగరత్న తెలిపారు. మంగళవారం దేవపట్ల సచివాలయంలో పోషణ్‌పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా నాగిరెడ్డిగారిపల్లె, మోటకట్ల, నారాయణరెడ్డిపల్లె, రౌతుకుంట, గుట్టపల్లెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

సిద్దవటం : ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పచ్చదనాన్ని పెంపొందిచాలని సిద్దవటం రేంజర్ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సిద్దవటం పురవీధుల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రేంజర్ ప్రసాద్ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడాలన్నారు. అడవుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అడవుల్లో చెట్లు నరకడం, నిప్పు పెట్టడం నేరమని తెలియజేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తహసీల్దారు శంకర్‌రావు, ఎంఈఓ శంకరయ్య, ఎస్‌ఐ తులసీ నాగ్రప్రసాద్, రేంజర్ ప్రసాద్‌లు బహుమతులను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, బీటు అధికారులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత

ఒంటిమిట్ట : అటవీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఫ్‌ఎస్‌ఓ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మంటపంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌ఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ అడవులను పచ్చగా ఉంచాలని, వాటికి నిప్పు పెట్టి నాశనం చేయకూడదన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

బహుమతుల ప్రదానం

ఒంటిమిట్ట : డౌన్ సిండ్రోమ్ అనేది ఒక జన్యు సంబంధమైన వ్యాధి అని మండల విద్యాశాఖ అధికారి వెంకట సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని భవిత కేంద్రంలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా భవితా కేంద్రంలోని విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలిచిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులను అందజేశారు. బహుమతుల అందజేసేందుకు సహకరించిన హరినాథరెడ్డికి అభినందనలు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

రాయచోటి టౌన్ : డైట్ పాఠశాలను డీఈఓ పురుషోత్తం ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఎలా అందిస్తున్నారని తనిఖీ చేసి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్‌ఏ-4 పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సలహాలు చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

చిన్నమండెం : జాతీయ రహదారిపై ప్రమాదకర మలుపుల వద్ద కాన్వెక్స్ అద్దాలను ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కాన్వెక్స్ అద్దాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వండాడి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఒక ఇనుప స్తంభం, చిన్నమండెం బస్టాండు కూడలి వద్ద రెండవ ఇనుప స్తంభం ఏర్పాటు చేశామన్నారు. ఈ ఇనుప స్తంభాలకు కాన్వెక్స్ కాన్వెక్స్ అద్దాలను రెండు మూడు రోజుల్లో బిగించనున్నట్లు తెలిపారు. అదే విధంగా దేవపట్ల కూడలి వద్ద మరో కాన్వెక్స్ అద్దాలను మంజూరు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిపారు. ఇనుప స్తంభాలను బిగించడంలో వండాడి సర్పంచ్ మునల్‌రెడ్డి, చిన్నమండెం సర్పంచ్ నజీర్‌లు సహకరించడంతో వారిని దేవనాథరెడ్డి, ఎస్‌ఐ రమేష్‌బాబులు అభినందించారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

పెనగలూరు : ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్లెస్సీ అన్నారు. మంగళవారం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పదోతరగతిలో ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించినట్లైతే వారి జీవితం బాగుపడి మంచి ఉద్యోగాలు సంపాదిస్తారని ఆమె తెలియజేశారు. పదోతరగతిలో మంచి మార్కులు సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, కట్టావారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, ఎంఈఓ జయవేలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బ్లెస్సీ

పోస్టర్ ఆవిష్కరణ

రాజంపేట : ఏఐటీఎస్‌లో మంగళవారం సీజీఆర్ టాలెంట్ మీట్- 23 పోస్టర్‌ను ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ సింపోజియం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, కల్చర్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ అనే అంశాలపై మీట్ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 3, 4వ తేదీలలో అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో వ్యక్తిగత నైపుణ్యం పెరుగుతుందన్నారు. అన్ని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డా.ఎం.సుబ్బారావు, ఈఈఈ హెచ్‌ఓడీ పద్మలలిత, ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి నూకా సుబ్బారెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను దూరం పెట్టకుండా దగ్గిరికి తీసి ఆదరించాలని డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులను కొంతమంది దత్తత తీసుకొని వారికి న్యూట్రీషన్ ఫుడ్‌ను అందించారు. దాతలు చిన్నపరెడ్డి, బండ్రెడ్డి శంకర్‌రెడ్డి, సీహెచ్‌ఓ రవీంద్రలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడంతో వారిని అభినందించారు. దాతలు మానవతా దృక్పథంతో క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరించి వారి ఆరోగ్యాన్ని కాపాడటం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు.

పెరిగిన కూలీ రేట్లను ఇవ్వాలి

రాయచోటి అర్బన్ : జిల్లావ్యాప్తంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు పెరిగిన కూలీరేట్లను ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాయచోటి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టాక్ పాయింట్ వద్ద హమాలీలు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, హమాలీలు కృష్ణయ్య, రాంప్రసాద్, సంపత్, వెంకట నరసింహులు, ఆంజనేయులు, దేవ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలంతో మున్సిపాలిటీకి భారీ ఆదాయం

రాజంపేట : మార్కెట్ గేట్ వేలంపాట ద్వారా మున్సిపాలిటీకి రూ.69,19,400 ఆదాయం వచ్చిందని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై కౌన్సిల్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని పేర్కొన్నారు. అలాగే వార్డులలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించినట్టు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచేందుకు నిధులను కేటాయించామన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌లు మర్రి రవి, షేక్ సుమియా, కమిషనరు జనార్దన్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిరంతర కృషితో కలలు సాకారం

రాయచోటి టౌన్ : ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన విధంగా విద్యార్థులు కలలు కనాలి, ఆ కలలను సాకారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తూ ఉండాలని డైట్ ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ శివభాస్కర్ అన్నారు. మంగళవారం డైట్ కళాశాల ఆవరణలో ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్షణ వారి సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి (ఈఎంపీడీ) కార్యక్రమంలో భాగంగా డైట్ పాఠశాలలో జిల్లాస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 80 పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో 10 పాఠశాలలను ఎంపిక చేసి వారు చేపట్టిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపుతున్నట్లు తెలిపారు. వీటి నుంచి మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలు అందుతాయని తెలిపారు.

నష్టపరిహారం ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

రాయచోటి అర్బన్ : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50వేలు చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలోని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలంటూ కోరారు. జిల్లాలో దాదాపుగా 20వేల హెక్టార్లలో దెబ్బతిన్నాయన్నారు. అధికారులు ఇప్పటి వరకు పొలాలను సందర్శించి, పంటనష్టం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి పంపకపోవడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రెడ్డెయ్య, నాగశేషుతో పాటు పలువురు సంఘం నేతలు, రైతులు పాల్గొన్నారు.